..చాణక్యుడి నాలుగంచెల వ్యూహాన్నే కేసీఆర్ తెలంగాణ పునర్నిర్మాణంలో యథాతథంగా అమలు చేశాడు. తొలుత ఢిల్లీని కదిలించి తెలంగాణ సాధించాడు. తొలి ఐదేండ్లలో సుస్థిరతకు పెద్దపీట వేశాడు. రెండో అయిదేండ్లలో ఆ పునాదుల మీద అభివృద్ధి పంటలు పండించాడు. ఆ ఫలాలను సంక్షేమ పథకాల రూపంలో జనానికి దోసిళ్లకొద్దీ పంచాడు. 'ఏనుగును బంధించడానికి వేసవిని మించిన ముహూర్తం లేదు' అంటాడు చాణక్యుడు. కారణం, ఆ సమయంలో నీటి కొరత ఉంటుంది. గజరాజు దట్టమైన అడవిని దాటి బయటికొస్తాడు. సులభంగా చిక్కిపోతాడు. 'ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడానికి ఎన్నికల రాజకీయాలను మించిన మార్గం లేదు' అని భావించాడు కేసీఆర్. అందుకే, తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించాల్సి వచ్చిన ప్రతిసారీ రాజీనామా చేసి మరీ బరిలో నిలిచాడు. గురి చూసి కొట్టాడు. వైరి వర్గాలు గిలగిలా తన్నుకొనేలా చేశాడు.

'ప్రజల మనసును పుస్తకంలా చదవగలిగిన వాడే నాయకుడు' అంటుంది చాణక్య సూత్రం. కేసీఆర్ ఆ విద్యలో నిష్ణాతుడు. నెర్రెలుబారిన నేలకు నీళ్లు కావాలి. కాబట్టే, ప్రాజెక్టులపై దృష్టి సారించాడు. ఎండిపోతున్న గొంతుకల దప్పిక తీర్చాలి. అందుకే మిషన్ భగీరథ తీసుకొచ్చాడు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతులకు ఆసరా కావాలి. రైతుబంధు ప్రధాన లక్ష్యం అదే. అన్నీ జనానికి అవసరమైవే. 'క్షీరార్థినః కిం కరిణ్యా'.. పాలు అవసరమైనవారికి ఏనుగును ఇస్తే ఏం ఉపయోగం? ఇస్తే గిస్తే పాడి ఆవు ఇవ్వాలి కానీ?.. ప్రతిపక్షాలు సరిగ్గా ఇలాంటి దండగ పనే చేస్తున్నాయి. మ్యానిఫెస్టోలతో మభ్యపెడుతున్నాయి. అబద్ధపు హామీలు గుప్పిస్తున్నాయి. ప్రజలు ఆ జిత్తులను గుర్తిస్తున్నారు. 'బెల్లం పాకంలో ముంచినంత మాత్రాన వేప కొమ్మ మామిడికొమ్మ కాలేదు కదా' అంటూ తీపి ముచ్చట్లతో చేరువకావడానికి యత్నించే వారికి దూరంగా ఉండమని హెచ్చరిస్తాడు చాణక్యుడు.

## విదుర నీతి

**గణితశాస్త్ర ఫార్ములాను తలపిస్తాయి విదురుడి బోధనలు. కోపం రెండు రకాలు, దురాశ నాలుగు రకాలు.. ఇలా పక్కా లెక్కలేసి చెప్పడం ఆయనకే చెల్లింది.**



- సముద్ర యాత్రికుడికి ఓడ ఎలాంటిదో.. జీవన యాత్రికుడికి సత్యం అలాంటిది.
- ఇంద్రియ నిగ్రహంలేని రాజు.. రంధ్రం పడిన తోలుతిత్తితో సమానం. తిత్తిలోని నీళ్లన్నీ ఒలికిపోయినట్టు.. పాలకుడి ఘనత కాలగర్భంలో కలుస్తుంది.
- ఆపదలకు భయపడని పాలకుడిని ధురంధరుడు అంటారు. అలాంటి నేతలే మనకు కావాలి.
- చల్లారిపోయిన విరోధాన్ని కెలకడం రాజనీతి అనిపించుకోదు. అంతిమంగా పాలకుడికే నష్టం.
- ధర్మాన్ని అనుసరించే రాజు దేవతలకూ ప్రీతిపాత్రుడు అవుతాడు.
- వృద్ధాప్యం సౌందర్యాన్ని హరించినట్టు, అవినీతి రాజ్యాన్ని బలిగొంటుంది.
- ఆహారానికి ఆశపడి చేప ఇనుప గాలాన్ని మింగుతుంది. చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకుంటుంది. బంధుప్రీతి కూడా అంతే ప్రమాదకరం.
- ఏ స్త్రీ అయినా నపుంసకుణ్ని భర్తగా ఒప్పుకోదు. ఏ రాజ్య ప్రజలు అయినా అసమర్థుడిని నాయకుడిగా ఆమోదించరు.
- ధర్మానికి సత్యం, వేదానికి పండితులు, అశ్వానికి శిక్షణ, రాజుకు మంత్రిమండలి.. రక్ష!
- అధికారం అనేది బలం కాదు.. బాధ్యత.

'ప్లీజ్ ఒక్క అవకాశం ఇవ్వండి', 'మాకూ అధికారం ప్రసాదించండి'.. అంటూ కొన్ని పార్టీలు యాచించినంత పని చేస్తున్నాయి. ఓటును అభ్యర్థించాలి, దేబిరించకూడదు. 'అర్థించడం వల్ల గౌరవాన్ని కోల్పోతాం' అంటూ అలాంటి వారికి వాతలు పెడతాడు ఆచార్యుడు.

'సువిశాలమైన సచివాలయం, సమర్థులైన మంత్రులు, దుర్భేద్యమైన రాజధాని, పుష్కలమైన ఆదాయ వనరులు, బలమైన రక్షకభట వ్యవస్థ'.. ఈ ఐదూ రాజ్యానికి అత్యంత కీలకమని విశ్లేషిస్తాడు చాణక్యుడు. కేసీఆర్‌కు కూడా ఈ ఐదు విభాగాలూ పంచప్రాణాలే.

'ఏ ఆర్థిక వ్యవస్థకైనా వ్యవసాయమే మూలాధారం. సేద్యం బావుంటేనే.. ప్రజలకు ఆహారం, పశువులకు పోషణ, పక్షులకు గింజలు, ఖజానాకు రాశులు' అంటూ రాజ్య పాలన వ్యవసాయ కేంద్రంగా సాగాలని నొక్కి చెప్పాడు చాణక్యుడు. కేసీఆర్ పక్కాగా ఆ మార్గంలోనే వెళ్తున్నాడు. కాబట్టే, తెలంగాణ వరిసాగులో దూసుకెళ్తున్నది. ప్రజలకు ముప్పూటలా సన్నబియ్యపు భోజనం వడ్డిస్తున్నది. పల్లెలు పశు సంపదతో కళకళలాడుతున్నాయి. వలస పక్షులు వెనక్కి వస్తున్నాయి. విదేశీ పక్షులూ చుట్టపుచూపుగా తరలి వస్తున్నాయి. గుడ్లు పెట్టి, పొదిగి, పిల్లాపాపలతో తిరిగి వెళ్తున్నాయి. ఇది కదా సంక్షేమ రాజ్యం అంటే! చాణక్యుడే బతికుంటే.. తెలంగాణ మాడల్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరో అర్థశాస్త్రం రాసేవారు. 'నీ మిత్రులు సర్వకాల సర్వావస్థల్లో నీ వెన్నంటి ఉంటారు. నీ శత్రువులు ఆరునూరైనా నీకు మద్దతు తెలపరు. మిగిలింది తటస్థులు. వారే కనుక నీ వెనుక నిలిస్తే.. నీకిక తిరుగులేదు' అంటాడు చాణక్యుడు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రులు, గుజరాతీలు, కన్నడిగులు, తమిళులు, మలయాళీలు.. ఇలా ఎంతోమంది కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారు. మేధావులు, బుద్ధిజీవులు, కవిగాయక వైతాళికులు.. కారు – సారు మంత్రం జపిస్తున్నారు. తటస్థుల ఓట్లు బీఆర్ఎస్‌కే అని సకల సర్వేలూ చెబుతున్నాయి. ఇప్పుడు జరుగుతున్నది ద్విముఖ పోరూ కాదు, త్రిముఖ పోరూ కాదు. ఏకపక్ష యుద్ధం. అంతిమ విజయం ఎప్పుడో ఖరారైపోయింది. 'మిణుగురు పురుగుల సమూహం దూరం నుంచి చూస్తే పెనుమంటలా అనిపిస్తుంది. దగ్గరికెళ్తే బండారం బయటపడుతుంది. అదే దీపం.. దగ్గరికి వెళ్లినకొద్దీ మరింత తేజోవంతంగా కనిపిస్తుంది' అంటూ ఓ చక్కని ఉపమానాన్ని జోడించాడు చాణక్యుడు. తెలంగాణ రాజకీయాల్లో మిణుగురుల మిడిసిపాటు ఎవరిదో, దీపకాంతి ఎవరిదో ప్రత్యేకించి చెప్పాల్సిన పన్లేదు.

### భీష్మ యోధ.. కర్తవ్య బోధ

మహాభారతం.. నాలుగువేదాలకు అయిదో రూపం. వేలకొద్దీ రుక్కుల సారం.. వందలాది పాత్రల ప్రతిరూపం. అందులోనూ భీష్మ పితామహుడు నిలువెత్తు ధర్మశాస్త్రం. పాలన విజ్ఞాన సర్వస్వం. శాంతిపర్వంలో..

